

5న మంత్రి మండలి కీలక సమావేశం

బెంగళూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధ్యక్షతన మంత్రిమండలి కీలక సమావేశం ఈ నెల 5న సాయంత్రం 4 గంటలకు జరగనుంది. సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో పలు ప్రముఖ నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని సీఎంఓ కార్యాలయ వర్గాల ద్వారా తెలిసింది. ఢిల్లీ పర్యటన ముగించుకుని వచ్చాక జరిగే ఈ సమావేశంలో సీఎం ఒక ప్రముఖ నిర్ణయాన్ని తీసుకునే అవకాశం ఉందని వినిపిస్తోంది.

లోక్‌సభ ఎన్నికల వేళ

వివాదాస్పద నిర్ణయాలు వద్దు

- సీఎంకు అధిష్టానం పెద్దల సూచన





బెంగళూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ముంగిట వివాదాస్పద నిర్ణయాల జోలికి వెళ్లొద్దని ప్రత్యేకించి హిందుత్వ విషయంలో మృదు విధానాన్ని అనుసరించాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు అధిష్టానం పెద్దలు స్పష్టమైన సూచన చేసినట్టు తెలుస్తోంది. మూడు దశాబ్దాల క్రితం నాటి అయోధ్య గొడవకు సంబంధించి ఇద్దరు కరసేవకులను అరెస్టు చేసిన వ్యవహారాన్ని బీజేపీ బ్రహ్మాస్త్రంగా మార్చుకోవడంతో కాంగ్రెస్ అధిష్టానం దిద్దుబాటు చర్యలకు దిగింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ మేరకు ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ఫోన్ చేసి హిందువుల ఓట్లు ఏకమయ్యే విధానం పార్టీకి 2024 లోక్‌సభ ఎన్నికల్లో చేటు తెచ్చే అవకాశం ఉందని, జాగ్రత్తగా అడుగులు వేయాలని సూచించినట్టు సమాచారం. ఈసారి ఖచ్చితంగా 20లోక్‌సభ నియోజకవర్గాలను కైవసం చేసుకోవాలని గట్టిపట్టుతో ఉన్న కాంగ్రెస్ అధిష్టానం అనవసర విషయాల జోలికి వెళ్లి వివాదాలు నెత్తిన వేసుకోవద్దని సుతిమెత్తగానే ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు తేల్చి చెప్పినట్టు తెలుస్తోంది.

రాజుకుంటున్న వివాదం

మూడు దశాబ్దాలనాటి కేసును తిరగతోడి అప్పట్లో గొడవలకు కారణమయ్యారన్న ఆరోపణలతో ఇద్దరు కరసేవకులను అరెస్టు చేసిన వ్యవహారంలో వివాదం తీవ్ర స్థాయిలో రాజుకుంటోంది. బీజేపీ దీనికి హిందూత్వ అంశాన్ని జోడించడంతో ముఖ్యమంత్రి సిద్దరామయ్య స్వయంగా ప్రకటన చేయాల్సి వచ్చింది. కరసేవకుల అరెస్టు విషయంలో ఎలాంటి కక్ష సాధింపు రాజకీయాలు లేవని, అమాయకులను అరెస్టు చేయలేదని స్పష్టం చేశారు. దీన్ని రాజకీయం చేయడం తగదని ఉపముఖ్యమంత్రి డాక్టర్ జి. పరమేశ్వర్ పేర్కొన్నారు. మరోవైపు బీజేపీ ఈ విషయంలో విమర్శల దాడిని తీవ్రతరం చేసింది. ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ 2024 లోక్‌సభ ఎన్నికల్లో హిందువులంతా ఏకమై కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కరసేవకుల అరెస్టుతో రాష్ట్రంలో కాంగ్రెస్ పతనం ప్రారంభమైనట్టేనని అన్నారు. కరసేవకుల అరెస్టు వ్యవహారం వివాదాస్పదంగా మారడంతో హుబ్బళ్లి పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమార్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రామజన్మభూమి వివాదానికి, నిందితుల అరెస్టుకు ఎలాంటి సంబంధం లేదన్నారు. హింసాకాండకు పాల్పడినవారిని అరెస్టు చేయడం సరైన నిర్ణయమేనంటూ సమర్థించుకున్నారు. గత 30 సంవత్సరాలుగా పరారీలో ఉన్న 37 కేసులకు సంబంధించిన నిందితులను గాలిస్తున్నామని, వీరందరికీ వేర్వేరు కేసులతో సంబంధాలు ఉన్నాయని వివరణ ఇచ్చారు. అప్పటి గొడవలకు సంబంధించి నిజనిర్ధారణ చేస్తున్నామన్నారు. బీజేపీ మాత్రం కరసేవకుల అరెస్టు ద్వారా రాజకీయ లబ్ధి పొందేందుకు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలకు పిలుపునిచ్చింది. మైనారిటీలను బుజ్జగిస్తూ హిందూ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్‌కు 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పడం ఖాయమని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప పేర్కొన్నారు. దమ్ముంటే కరసేవకులందరినీ అరెస్టు చేయాలని మాజీ మంత్రి సునీల్ కుమార్ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఈ తాజా తలనొప్పి వ్యవహారంతోనే కాంగ్రెస్ అధిష్టానం రంగంలోకి దిగి దిద్దుబాటు చర్యలు చేపట్టినట్టు సమాచారం.

ఇది పూర్వజన్మ సుకృతం



అయోధ్య రాముడి విగ్రహ శిల్పి అరుణ్ యోగి రాజ్

తాను చెక్కిన శిల్పాలతో అరుణ్ యోగిరాజ్

బెంగళూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని రామమందిరంలో తాను చెక్కిన సీతారామలక్ష్మణ ఆంజనేయ విగ్రహాలు ప్రతిష్ఠించబోతుండడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని మైసూరుకు చెందిన ప్రముఖ శిల్పి అరుణ్ యోగిరాజ్ పేర్కొన్నారు. మైసూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రామ మందిర ప్రారంభోత్సవానికి హాజరు కావాల్సిందిగా తనకు కూడా శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు నుంచి ఆహ్వానం అందిందని తెలిపారు. కుటుంబ సమేతంగా ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనబోతున్నట్టు చెప్పారు. విగ్రహాలు చెక్కేందుకు కేంద్ర నిపుణుల బృందం వివిధ శిలలను పరిశీలించి చివరికి మైసూరు జిల్లా హెచ్‌డీ కోటె తాలూకా బజ్జేగౌడనపుర గ్రామంలో లభించిన నల్ల శిలను ఎంపిక చేసి తనకు అప్పగించిందన్నారు. ఈ శిల్పాలను చెక్కేందుకు తనకు ఆరు నెలల సమయం పట్టిందన్నారు. అయోధ్యలోనే ఉండి ప్రతిరోజూ 12-14 గంటలపాటు శ్రమించి శిల్పాలు చెక్కానని పేర్కొన్నారు. ఐదు సంవత్సరాల బాలరాముడి విగ్రహాన్ని ఐదు అంగుళాల మేర చెక్కాలని చెప్పారన్నారు. నిజంగానే ఇది తనకు సవాల్‌గా ఉందన్నారు. చిన్నరమేళాలో బాలరాముడి విగ్రహాలను తానే చెక్కానని, వీటితో స్ఫూర్తి పొంది అయోధ్య రామమందిరం కోసం ఎంతో చిత్తశుద్ధితో వీటిని చెక్కామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఒక మహాయజ్ఞంలా సాగిందన్నారు. కర్ణాటకకు అయోధ్యకు అవినాభావ సంబంధం ఉందని, రామాయణంలో ప్రస్తావనకు వచ్చే కిష్కింధ (అంజనాద్రి) కర్ణాటకలో ఉందని, దీన్ని ఆంజనేయస్వామి జన్మస్థలంగా ప్రజలు ప్రగాఢంగా విశ్వసిస్తారని తెలిపారు.

ఎలక్ట్రికల్ బస్సు, జీపు ఢీ

నలుగురి మృతి

బెంగళూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అతివేగంగా వెళ్తున్న కేఎస్‌ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు, జీపు ఎదురెదురుగా ఢీ కొన్న దుర్ఘటనలో నలుగురు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా, ఐదుగురు గాయపడిన సంఘటన హుణసూరు బైపాస్ రోడ్డులో మంగళవారం ఉదయం సంభవించింది. కేఎస్‌ఆర్టీసీ ఇటీవల ప్రారంభించిన ఇవి ఫ్లవర్ బస్ ప్రమాదానికి లోను కావడం ఇదే మొదటిసారి. ప్రమాదంలో బస్సు డ్రైవర్‌కు కూడా గాయాలయ్యాయి. హెచ్‌డీ కోటె సమీపంలోని సంతలో పాల్గొన్న లోకేశ్, సోమేశ్, సతీశ్, మను జీపులో వస్తూ ప్రమాదానికి గురై మృతి చెందారు. వీరంతా 30-40 ఏళ్లలోపువారేనని పోలీసులు తెలిపారు. గాయపడిన ఐదుగురిని హుణసూరు, మైసూరు ఆసుపత్రులకు తరలించి చికిత్సలు అందిస్తున్నారు. వీరిలో నింగరాజు, కరియప్ప పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్టు తెలుస్తోంది. పెరియపట్టణంలోని అల్లం తోటలో కూలి పనిచేసిన 8 మంది కార్మికులను జీపు డ్రైవర్ మను ఎక్కించుకుని వెళ్తుండగా బైపాస్‌రోడ్డులో ఎదురుగా వచ్చిన కేఎస్‌ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు ఢీ కొనడంతో దుర్ఘటన జరిగింది. పోలీసులు రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ ప్రమాదంపై రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామన్నారు.

సాంకేతిక సేవల్లో మైలురాయి డేటా అనలిటిక్స్ కేంద్రం

- కెనరాబ్యాంకు ఎండీ, సీఈఓ కె.సత్యనారాయణరాజు

బెంగళూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కెనరాబ్యాంకు బెంగళూరులో తన సరికొత్త డేటా అండ్ అనలిటిక్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాన్ని బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కె. సత్యనారాయణరాజు సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతికతను పూర్తి స్థాయిలో బ్యాంకు ఖాతాదారులకు అందుబాటులోకి తెచ్చే దిశలో ఈ కేంద్రం బాగా దోహదపడనుందని పేర్కొన్నారు. ఈ సెంటర్‌ను ఆయన 'హబ్ ఆఫ్ ఎక్సలెన్స్'గా అభివర్ణించారు. బ్యాంకు ఖాతాదారు ల లావాదేవీలు గతంతో పోలిస్తే ఇ ప్పుడు బాగా సులభతరమయ్యాయని తెలిపారు. కేవలం స్మార్ట్‌ఫోన్లలోనే ఎక్కడైనా సరే క్షణా ల్లో లావాదేవీలు జరిపే అవకాశం అందుబాటులోకి వచ్చిందన్నారు. బ్యాంకు సేవల రంగంలో ఇదొక మైలురాయి కానుందన్నారు. డేటా అనలిటిక్స్ సెంటర్ నిర్వహణలో ఇటీవల డాకో ఈ-థాన్ గ్రాండ్ ఫినాలెను విజయవంతంగా నిర్వహించామని, దీనికి అనూహ్యస్పందన లభించిందన్నారు. మొత్తం 2,899 మంది డాకో ఈ-థాన్‌లో పాల్గొని 256 ఇన్నోవేటివ్ ఐడియాలను సమర్పించారని వివరించారు. జనవరి 1న జరిగిన ఫైనల్స్‌లో ఐదుగురు వినూత్న ఐడియాలు సమర్పించి బహుమతులు కైవసం చేసుకున్నారని అన్నారు. కార్యక్రమంలో బ్యాంకు ఉన్నతాధికారులు, సాంకేతిక విభాగానికి చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.



డేటా అండ్ అనలిటిక్స్ కేంద్రం ప్రారంభంలో కెనరాబ్యాంకు ఎండీ, సీఈఓ కె. సత్యనారాయణరాజు తదితరులు


రాజధానిలో ఆస్తిపన్ను బకాయిలు

500 కోట్లు

- 6 లక్షల మంది బకాయిదారులు
- చర్యలకు బీబీఎంపీ సిద్ధం



బెంగళూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాజధాని బెంగళూరు నగరంలో మొత్తం 6 లక్షల మంది తమ ఆస్తులకు సంబంధించి పన్ను బకాయిలు చెల్లించాల్సి ఉంది. వీరు చెల్లించాల్సిన బకాయి మొత్తం సుమారు రూ.500 కోట్లుగా ఉంది. బీబీఎంపీ ఉన్నతాధికారి ఒకరు నగరంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఆస్తి పన్నుల బకాయిలు చె ల్లించాల్సిన వారందరికీ ఎస్‌ఎంఎస్ నో టీసులను పంపుతున్నట్లు చెప్పారు. 'మీరు ఇంకా ఆస్తి పన్ను ఇంతవరకు చెల్లించలేదు. బాకీ అలాగే కొనసాగిస్తే బీబీఎంపీ చట్టం -2020 ప్రకారం చర్యలు తీసుకుంటాం' అంటూ మొబైల్ ఫోన్లకు చిరు సందేశాలను పంపిస్తున్నామని తెలిపారు. ఇలా సందేశాలు కనీసం మూడుసార్లు పంపుతామని అప్పటికీ స్పందించకపోతే ఆస్తిని జప్తుచేస్తామని, క్రిమినల్ కేసులను కూడా దాఖలు చేసే అవకాశం ఉందని చెప్పారు. నగరవ్యాప్తంగా ఒక ఏడాది అంతకంటే ఎక్కువ కాలం ఆస్తి పన్నుల బకాయి ఉన్నవారికి గత మూడు నెలలుగా చిరు సందేశాలను పంపుతున్నామని వివరించారు. ఆస్తిపన్నుల బకాయిలు పడ్డ వారి వివరాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి, బ్యాంకులకు కూడా పంపిస్తున్నామని దీని వల్ల సదరు ఆస్తుల విక్రయం, తనఖా సాధ్యపడవని పేర్కొన్నారు. తప్పనిసరిగా ఆస్తి పన్నుల బకాయి చెల్లించాల్సి ఉంటుందన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1589.07	1,624.39
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	00
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1709	8,694
సామర్థ్యం (టీఎంసీలు)	10.27	74.52

ఏపీ రాజకీయాల్లోకి శ్రీరాములు కుటుంబం

● వైసీపీలోకి బీజేపీ నాయకులు ● జగన్ చేతుల మీదుగా కండువా కప్పుకున్న బళ్లారి మాజీ ఎంపీ శాంత

బళ్లారి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ మాజీ ఎంపీ జే. శ్రీరాములు కుటుంబం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టడం చర్చనీయాంశంగా మారింది. బీజేపీకి చెందిన బళ్లారి మాజీ ఎంపీ జే. శాంత మంగళవారం విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌రెడ్డి చేతుల మీదుగా వైసీపీ కండువా కప్పుకున్నారు. జే.శాంత బళ్లారి మాజీ ఎంపీ, మాజీ మంత్రి శ్రీరాములుకు స్వయానా సోదరి కావడం విశేషం.

వాల్మీకి సామాజికవర్గానికి చెందిన శ్రీరాములు కర్ణాటక బీజేపీలో కీలక నాయకుడు. గత బీజేపీ ప్రభుత్వంలో ఆయన మంత్రిగా పనిచేశారు. ఎంపీగానూ గెలిచారు. జే.శాంత భర్త గుంతకల్లుకు చెందినవారు. అయినా ఆమె బళ్లారిలోనే ఉంటున్నారు. 2009లో బీజేపీ నుంచి బళ్లారి ఎంపీగా జే.శాంత చేత పోటీ చేయించారు. అప్పుడు బీజేపీ ప్రభుత్వంలో జే.శ్రీరాములు, గాలి జనార్దన్‌రెడ్డి, గాలి కరుణాకర్ రెడ్డి మంత్రులుగా ఉండేవారు. అలాగే గాలి సోమశేఖర్‌రెడ్డి కేఎంఎఫ్ అధ్యక్షుడిగా పనిచేశారు. అప్పటి ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో ఒక్క సండూరు మినహా బీజేపీ ఎమ్మెల్యేలే ఉన్నారు.

అప్పుడు కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్‌వై హనుమంతప్ప పోటీలో నిలిచారు. బీజేపీకి ఇంత బలం ఉన్నా ఆమె ఎన్‌వై హనుమంతప్ప పై కేవలం 2వేల పై చిలుకు ఓట్లతోనే ఎంపీగా గెలిచారు. పది వరకూ చదివిన జే. శాంత తెలుగు బాగా మాట్లాడగలరు. గతంలో జరిగిన ఎన్నికల్లో కర్ణాటకలో గాలి బ్యాచ్ అంతా ఓడిపోయింది. ఎమ్మెల్యేగా పోటీ చేసిన శ్రీరాములు కూడా కాంగ్రెస్ అభ్యర్థి ప్రస్తుత మంత్రి బి. నాగేంద్ర చేతిలో చిత్తుగా ఓడిపోయారు. శ్రీరాములు వర్గం దాదాపు కర్ణాటక ఎన్నికల్లో ఓడిపోయింది. అయితే మాజీ మంత్రి శ్రీరాములు తన సోదరి జే. శాంతను ఏపీ రాజకీయాల్లో ...అదీ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలో చేర్పించడం వెనుక హైద్రాబాద్‌కు చెందిన ఒక రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కీలక పాత్ర పోషించారని తెలుస్తోంది. శాంతను అనంతపురం, లేదా హిందూపురం ఎంపీగా పోటీ చేయించాలని పార్టీ నిర్ణయించినట్లు సమాచారం. వాల్మీకి సమాజానికి చెందిన వారిని కర్ణాటక నుండి దిగుమతి చేసుకోవడంపై అక్కడ ఉండే వాల్మీకులు జగన్‌మోహన్‌రెడ్డిపై మండిపడుతున్నారు. ఇంతకాలం పార్టీలో ఉన్న తమను కాదని ఎక్కడో కర్ణాటక నుంచి తీసుకొచ్చి శాంత చేత పోటీ చేయించడం ఎంతవరకు సమంజసమని అక్కడ వైసీపీ కార్యకర్తలు మండి పడుతున్నారు. మొత్తం మీద ఇక్కడ కర్ణాటక బీజేపీలో ఉండే మాజీ ఎంపీ శ్రీరాములు సోదరి ఏపీ రాజకీయాల్లో ఎంట్రీ ఇవ్వడంపై తీవ్ర చర్చలు నడుస్తున్నాయి.



బీజేపీ మాజీ ఎంపీ జే. శాంతతో అన్న శ్రీరాములు చర్చలు (ఫైల్)



ఏపీ సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన బీజేపీ మాజీ ఎంపీ శాంత

ఘనంగా తాయమ్మదేవికి పూజలు



ప్రత్యేకాలంకరణలో శ్రీతాయమ్మదేవి

సిరుగుప్ప, జనవరి 2 : శ్రీ తాయమ్మదేవికి ఘనంగా ప్రత్యేక పూజలు జరిగాయి. సిరుగుప్ప పట్టణం ఆదోని రోడ్డు మార్గంలో వెలసిన శ్రీ తాయమ్మ దేవికి ప్రధాన అర్చకులు ప్రవీణ్ పుష్పమాలలతో అలంకారం చేసి ప్రసాద పంపిణీ చేశారు. భక్తులు మంగళవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

పశుగ్రాసం ట్రాక్టర్ స్వాధీనం



అధికలోడుతో వెళుతున్న పశుగ్రాసం ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

సిరుగుప్ప, జనవరి 2 : ఓవరులోడుతో ఇతర రాష్ట్రాలకు వెళుతున్న పశుగ్రాసం ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. సిరుగుప్ప తాలుకాను ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించిన నేపథ్యంలో రైతులకు సంబంధించిన పశుగ్రాసం ఇతర రాష్ట్రాలకు వెళితే ఇక్కడ రాబోయే రోజుల్లో పశుగ్రాసం కొరత ఏర్పడే అవకాశాలున్నాయని పేర్కొంటూ తహసీల్దార్ సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ కారణంగా పోలీసులు అధిక ఓవర్‌లోడుతో వెళుతున్న పశుగ్రాసం ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఎస్‌ఐ తిమ్మానాయక్ దీనిపై కేసు నమోదు చేశారు.

5న జనస్పందన

బళ్లారి సిటీ, జనవరి 2: తాలూకాస్థాయి జనస్పందన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అధ్యక్షతన ఈనెల 5వ తేదీ ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేరా తెలిపారు. ప్రభుత్వ పనులకు సంబంధించి ప్రజలు జిల్లా నూతన పాలక సంస్థలోని తాలూకా కార్యాలయ హాల్లో జరిగే జనస్పందన కార్యక్రమంలో పాల్గొని తమ ఫిర్యాదులను అందజేయవచ్చని తెలిపారు.

జెస్కాం సిబ్బంది ధర్నా



మాన్వి జెస్కాం కార్యాలయం ఎదుట సిబ్బంది ధర్నా

రాయచూరు జనవరి 2: జిల్లాలోని మాన్వి సబ్ డివిజన్ జెస్కాం కార్యాలయం వద్ద మంగళవారం సిబ్బంది ఆకస్మికంగా ధర్నాకు దిగారు. వివిధ ప్రభుత్వ శాఖల నుంచి రెవెన్యూ వసుళ్లు చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ ఈ విభాగంలో పని చేసే దాదాపు 90 మందికి పైగా సిబ్బంది వేతనాలను అధికారులు నిలిపివేశారు. దీంతో ఆగ్రహించిన ఉద్యోగులు అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తు కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఇదే సమయంలో కిందిస్థాయి సిబ్బంది కూడా సమ్మెకు దిగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడమేకాక పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లో పలు సమస్యలు తలెత్తాయి.

నల్లరేగడి భూములపై అవగాహన అవసరం

● ఐఐఎస్‌డబ్ల్యూసీ అధికారి కృష్ణారావు సూచన

బళ్లారి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అతితక్కువ వర్షపాతం గల నల్లరేగడి భూముల్లో పండించాల్సిన పంటలపై రైతులు అవగాహన పెంచుకోవాలని భారతీయ భూ, జలసంరక్షణా సంస్థ (ఐఐఎస్‌డబ్ల్యూసీ) పరిశోధన అధికారి బి.కృష్ణారావు తెలిపారు. బళ్లారిలోని ఆ సంస్థ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నల్లరేగడి భూముల్లో సాగు పద్దతులు, అలాగే జల సంరక్షణ విధానంపై కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, మహారాష్ట్ర ఈ నాలుగు రాష్ట్రాలకు సంబంధించి బళ్లారిలో 1954లో ఐఐఎస్‌డబ్ల్యూసీ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. భారతదేశంలో ఎర్రనేల భూములు, నల్లరేగడి భూములు, ఒండ్రుమట్టి నేలలు ఇలా అనేక రకాల భూములు ఉన్నాయన్నారు. నల్లరేగడి నేలల్లో పంటల సాగు, నీటి సంరక్షణ, భూసారంపై రైతులకు అవగాహన కల్పించేందుకు బళ్లారి కేంద్రంగా ఐఐఎస్‌డబ్ల్యూసీని నెలకొల్పారన్నారు. ఈ ఏడాది అతితక్కువ వర్షపాతం నమోదు అయిందని., ఇలాంటి వర్షపాతంతో ఏ రకం పంటలు సాగు చేసుకోవాలో పరిశోధన సంస్థ ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వివిధ రకాల నీటి గుంటలు ఏర్పాటు చేయడంపై రైతులు అవగాహన పొందాలని తెలిపారు. ఇందుకు అనేక విద్యాసంస్థల నుండి విద్యను అభ్యసిస్తున్న వారికి కూడా అనేక పరిశోధనలు చేయిస్తున్నట్లు తెలిపారు. నల్లరేగడి భూముల్లో రైతులు జొన్న, రాగి, కంది, మిరప, లాంటి పంటలతో పాటు పండ్లతోటల పెంపకం, ప్రత్యామ్నాయ పంటల సాగు చేయడంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. శీతాకాలం, వేసవి కాలం, వానాకాలం ఇలా కాలానికి అనుగుణంగా నల్లరేగడి భూముల్లో తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు పొందేలా రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఇందుకు ప్రభుత్వం కూడా రైతుల కోసం అనేక అవగాహన కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని పరిశోధన సంస్థ ప్రధాన అధికారి బి. కృష్ణారావు తెలిపారు.



పరిశోధనాధికారి కృష్ణారావు

చేనేత ఉత్పత్తులతోనే ఆర్థికాభివృద్ధి

● వస్త్రసిరి-2024 ప్రారంభం ● 15వ తేదీ వరకు నగరంలో చేనేత వస్త్రమేళా
● చేనేత కార్మికులను ప్రోత్సహించాలి ● రాష్ట్ర చేనేత మండలి మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.లింగరాజు

బళ్లారి గాంధీనగర్, జనవరి 2: సమాజానికి రైతులు, చేనేత కార్మికులు రెండు కళ్ళులాంటి వారని కర్ణాటక రాష్ట్ర సహకార చేనేత కార్మికుల మహా మండలి మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.లింగరాజు పేర్కొన్నారు. రైతులు పండించిన పంటలకు, చేనేత కార్మికులు తయారు చేసిన ఉత్పత్తులకు మంచి ధర కల్పించినపుడే ఇద్దరి ఆర్థికాభివృద్ధి సాధ్యమన్నారు. జాతీయ చేనేత అభివృద్ధి మంత్రిత్వ శాఖ, రాష్ట్ర చేనేత మహామండలి,(కావేరి హ్యాండ్‌లూమ్స్), జిల్లా పంచాయతీ చేనేత జవుళి శాఖ సంయుక్తంగా నగరంలో 14 రోజుల పాటు నిర్వహిస్తున్న వస్త్ర సిరి-2024 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్థిక స్వావలంబన కోసం స్థానికంగా తయారు చేసిన వస్తువులను నేరుగా మార్కెట్‌కు తీసుకురావడానికి ఇలాంటి వస్త్రమేళ కార్యక్రమాలు సహాయకారిగా నిలుస్తాయన్నారు. నగరంలోని గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన వస్త్రసిరి ఎగ్జిబిషన్‌లో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలు, సిల్క్ చీరలు అమ్మకా నికి ఉంచినట్లు తెలిపారు. వస్త్ర ఎగ్జిబిషన్ కోసం 60 స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా చేనేత ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందించేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. జాతీయస్థాయిలో నిర్వహించే ఈ ఎగ్జిబిషన్ రాష్ట్రంలో మూడు చోట్లు నిర్వహించాలని నిర్ణయించగా మొదటి కార్యక్రమాన్ని మైసూరులో నిర్వహించామన్నారు. రెండో కార్యక్రమాన్ని బళ్ళారిలో నిర్వహించడం గర్వకారణన్నారు. మంచి ఆరోగ్యం కోసం కాటన్ దుస్తులు ధరించడం ఉత్తమమన్నారు. ఈ ఉత్పత్తుల్లో 100 శాతం కాటన్‌ను ఉపయోగించి తయారు చేస్తున్నారన్నారు. అనంతరం జిల్లా పంచాయతీ చేనేత జవుళి శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.విఠల రాజు మాట్లాడుతూ, నగరంలో జనవరి 2వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 10గంటల నుండి రాత్రి 10గంటలకు వస్త్రాల కొనుగోలుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ వస్త్ర మేళాలో మహిళలను ఆకట్టుకునే రీతిలో సిల్క్ శ్యారీస్, కాటన్ శ్యారీస్‌లు, బెడ్‌షీట్‌లు, మొళకాల్మూరు శిల్క్ శ్యారీస్, గద్వాల్ చీరలు, ఉన్నితో తయారు చేసిన కంబళ్ళు, డోర్‌మ్యాట్స్, డ్రెస్ మెటీరియల్, ఖాదీ దుస్తులు, సండూరు లమాణి చేతి ఉత్పత్తులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నగర ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిటీ డిప్యూటీ మేయర్ జానకి వస్త్రసిరి-2024ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా, జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రాహూల్ శరణప్ప సంకనూరు, కావేరి హ్యాండ్‌లూమ్ అధ్యక్షులు బి.జి. గణేష్, కావేరి హ్యాండ్‌లూమ్ డైరెక్టర్ మాజీ అధ్యక్షులు ఎస్.విరుపాక్షప్ప, ఉత్తర విభాగం చేనేత శాఖ జాయింట్ డైరెక్టర్ వీరేష్ ఎస్.దవళి, బళ్లారి జిల్లా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ మహంతేష్ కంచినమఠలతో పాటు పాలికె సభ్యులు వివేక్ తదితరులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న సిటీ డిప్యూటీ మేయర్ జానకి



గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి చేనేత వస్త్ర ఎగ్జిబిషన్

ఘనంగా పునీత్ రాజ్‌కుమార్ వర్ధంతి



పునీత్ రాజ్‌కుమార్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అభిమానులు

బళ్లారిరూరల్, జనవరి 2 : బళ్లారి నగరం ఏపీఎంసీ ఆవరణలో పునీత్ రాజ్‌కుమార్ అభిమానులు ఆయన మూడవ వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా మూడు వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన చనిపోయి మూడు సంవత్సరాలు కావడంతో ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దినేష్ కుమార్, అనీఫ్, దేవిరెడ్డి, గోవిందు, అబ్దుల్, రవి, శీన, పాలాక్షి, బసవ, లక్ష్మీనారాయణ యాదవ్, అబ్దుల్, శ్రీధర్, పుట్టా రామాంజినేయులు, పలువురు అభిమానులు పాల్గొన్నారు.

మిరప పంటకు ట్యాంకర్లతో నీరు

బళ్లారి సిటీ, జనవరి 02: సిరుగుప్ప, కురుగోడు తదితర ప్రాంతాలలో తుంగభద్ర కాలువ నీటిని నిలిపివేయడంతో మిర్చిసాగు చేసిన రైతులు పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్లను ఆశ్రయించారు. తాలూకాలోని రారావి, బగ్గూరు, కుడుదరహాలు, కొట్టాల చింతతోపాటు నడంగ, ఆగసనూరు, సూగూరు, ఇటగిహాల్ గ్రామాల్లో రైతులు తమ పొలాలకు ట్యాంకర్లతో నీటిని అందిస్తున్నారు. గత ఏడాది బ్యాడిగి, గుంటూరు రకం మిరపకాయలకు మంచి ధరలు లభించడంతో తాలూకా రైతులు ఈసారి 12,600 హెక్టార్లలో మిర్చి సాగు చేశారు. ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ట్రాక్టర్ అద్దె రూ.2500, ఒక ట్యాంకు నీటికి రూ 800లు, డీజిల్ మోటారు అద్దె రూ 3500లు చేరి ఒక రోజుకు సరాసరి 6వేల నుండి 7వేల వరకు ఖర్చు అవు చేయాల్సి వస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి కనీసం 40నుంచి 60 ట్యాంకర్ల నీరు అవసరమని రైతులు అంటున్నారు. తమకు ప్రభుత్వం ట్యాంకర్ల నీటి సరఫరా చేయడానికి సహాయం చేయాలని రైతులు కోరుతున్నారు. దీంతో ఎంత కష్టించినా పంట చేతికి రాక నష్టాల పాలవుతున్నారని రైతు శ్రీనివాసులు తెలిపారు.



మిరప పంటకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న రైతు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రాయచూరు జనవరి 2: జిల్లాలోని అసంఘటిత రంగంలో పని చేసే కార్మికులు ప్రభుత్వం ఇస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ సూచించారు. జిల్లా కార్మిక శాఖ కార్యాలయం వద్ద మంగళవారం గిగ్ కార్మికులకు, పేపర్ బాయ్‌లకు జిల్లాధికారి గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన జిల్లాధికారి అసంఘటిత రంగంలో పని చేసే కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆ దిశగా చేపట్టిన పథకాల గురించి వారికి వివరించారు. కార్మికులు తమ పేర్లను కార్మిక శాఖ వద్ద నమోదు చేసుకోవాలని తద్వారా ప్రభుత్వం అందజేసే పథకాలకు లబ్దిదారులుగా ఎంపికకావాలని సూచించారు.

హోసూరు జోన్

ఎడ్ల పండుగకు మార్గదర్శకాల జారీ



అధికారుల సమావేశంలో కలెక్టర్ సరయు

హోసూరు (కృష్ణగిరి) జనవరి 2: కృష్ణగిరి జిల్లాలో ఎడ్ల పండుగకు తమిళనాడు ప్రభుత్వం ప్రత్యేక మార్గదర్శకాలను జారీచేసింది. వివిధశాఖల అధికారులతో కలెక్టర్ సరయు ప్రత్యేకసమావేశం నిర్వహించిన అనంతరం విడుదలచేసిన మార్గదర్శకాలలో నెల ముందుగానే కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ప్రతిపాదిత స్థలం, తేదీని పేర్కొంటూ సరైన పత్రాలతో దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. తమిళనాడు గెజిట్‌లో పేర్లు ప్రచురితమైన గ్రామాలకు మాత్రమే వేడుక నిర్వహణకు అనుమతి ఇస్తామని తెలిపారు. పండుగ సందర్భంగా జరిగే అన్ని కార్యక్రమాలకు తమదే బాధ్యత అని హామీ ఇవ్వాలన్నారు. మొత్తం ఈవెంట్‌కు జాతీయం చేయబడిన కంపెనీ వద్ద బీమా చేసిన పత్రాన్ని కూడా నిర్వాహకులు తప్పనిసరిగా సమర్పించాలని పేర్కొన్నారు. ఎడ్ల పందాలకు సంబంధించి రెవెన్యూ అధికారుల అనుమతి పొందాలని, 250 ఎద్దులను మాత్రమే అనుమతిస్తామన్నారు. వేడుకకు 5 గంటల సమయం గరిష్ఠంగా కేటాయిస్తారని పేర్కొన్నారు. వేదిక నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న బావులు, కుంటలకు బ్యారికేడ్‌లు వేయాలన్నారు. ఎద్దుల ప్రవేశ ప్రాంతం నుంచి ముగిసే స్థలం వరకు 8 అడుగుల ఎత్తైన డబుల్ బారికేడ్‌లను కనీసం 3 రోజుల ముందు ఏర్పాటు చేయాలని సూచించారు. తగినంత విశ్రాంతితో ఎద్దులకు ఆహారం ఇవ్వాలని తెలిపారు. మంగళవారం ఏర్పాటైన ఈ సమావేశంలో జిల్లా సహాయ కలెక్టర్ (జనరల్) పి.పుష్ప, హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక, కృష్ణగిరి తహసీల్దార్ సీ బాబు, పశుసంవర్ధక శాఖ జోనల్ జేడీ రాజేంద్రన్, సహాయ సంచాలకులు అరుళ్‌రాజ్, జిల్లా అధికారులు, పోలీసులు, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖ, వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

హోసూరు విద్యార్థులకు డీఎస్పీ ప్రశంస

హోసూరు (సిప్‌కాట్) జనవరి 2: దక్షిణభారత క్రీడా పోటీల్లో హోసూరు విద్యార్థులు విజయం సాధించారు. కర్ణాటక రాష్ట్రం కూర్గ్‌లో దక్షిణ భారత సిలంబం పోటీలు జరిగాయి. ఇందులో తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ తదితర రాష్ట్రాల నుంచి 200మందికి పైగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో కృష్ణగిరి జిల్లా హోసూరుకు చెందిన 20 మంది పాఠశాల విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. కొందరు బంగారు పతకాలు సాధించారు. బంగారు పతక విజేతలను హోసూరు డీఎస్పీ బాబు ప్రశాంత్‌ను స్వయంగా అభినందించారు. సిలంబు సంఘం అధ్యక్షుడు దురై రామలింగం, కార్యదర్శి శరవణన్, పాల్గొన్నారు.



విజేతలతో డీఎస్పీ బాబు ప్రశాంత్

29 కిలోల గంధపు దుంగల స్వాధీనం

హోసూరు (క్రైం), జనవరి 2: ఆనేకల్ పరిధి జిగణి రోడ్డుల్లోని కుంభారహళ్ళి అటవీ ప్రాంతంలో గంధపు దుంగలను తీసుకెళ్లుతున్నట్లు సమాచారం రావడంతో అటవీశాఖాధికారులు తనిఖీలు చేశారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించగా చెట్లను నరుకుతున్నట్టు గుర్తించారు. వారిలో ఒకడు మాత్రమే పట్టుబడ్డాడు. 29కిలోల గంధపు కొయ్యలను స్వాధీనం చేసుకున్నారు.

ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

రాయచూరు జనవరి 2 : వివిధశాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఆల్‌ఇండియా డెమొక్రటిక్ యూత్ ఆర్గనైజేషన్(ఏఐడీవైఓ) నాయకుడు చన్నబసవ జానేకల్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్రంలో 10 లక్షలు, రాష్ట్రం పరిధిలో 2 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా వాటిని భర్తీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆరోపించారు. ఇందుకు నిరసనగా మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఏఐడీవైఓ ఆధ్వర్యంలో విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో ఆందోళన నిర్వహించారు. అనంతరం డీసీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు జిల్లాలోని రిమ్స్ వైద్య కళాశాల, వ్యవసాయ విశ్వ విద్యాలయాల్లో జరుగుతున్న ఉద్యోగ నియామకాల్లో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నట్లు ఆరోపించారు. వీటిని అరికట్టాలని ఖాళీల భర్తీ కోసం వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. నియామకాల్లో అవినీతి జరుగుతున్నందువల్ల మెరిట్ ఉన్న అర్హులైన విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.



అధికారికి వినతి పత్రం అందజేస్తున్న ఏఐడీవైఓ నాయకులు

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

రాయచూరు జనవరి 2 : నలుగురు తాగుబోతులు తనపై అకారణంగా దాడిచేశారన్న కారణంగా ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జిల్లాలోని సింధనూరు తాలూకా బెళగుర్కిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బసవరాజ్(24) సోమవారం రాత్రి తన ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా ఎదురు పడిన నలుగురు తాగుబోతులు అకారణంగా అతడితో వాగ్వా దానికి దిగి దాడి చేశారు. దీంతో తీవ్ర గాయాలపాలైన అతడు ఇంటికి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా దాడికి పాల్పడిన నలుగురు గతంలోను ఇదేరీతిగా బసవరాజ్‌పై దాడికి దిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పదే పదే తనపై దాడి చేస్తున్న వారిని ఎదిరించలేక బసవరాజ్ మృతి చెందాడని కుటుంబికులు తెలిపారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సింధనూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.



బసవరాజ్ (ఫైల్)

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

నిడుదవోలు వేంకటరావు (జయంతి)



సాహితీ విమర్శకులు, ప్రాచీన గ్రంథ పరిష్కర్తగా పేరొందిన నిడుదవోలు వేంకటరావు 1903 జనవరి 3న విజయనగరంలో జన్మించారు. తండ్రి సుందరం పంతులు గ్రంథాలయోద్యమ కార్యకర్తగా పేరొందారు. వీరి ఇంట్లో 1900 నాటికే 300 ముద్రిత గ్రంథాలు, 1500 తాళపత్ర గ్రంథాలు ఉండేవి. పోతన, చిన్నయసూరి జీవిత చరిత్ర, కొప్పరపు సోదర కవుల చరిత్ర రచించారు. కాకినాడలో సూర్యరాయాంధ్ర నిఘంటు కార్యాలయంలో పండితులుగా చేరి నిఘంటు నిర్మాణంలో కొంతకాలం పాల్గొన్నారు. మద్రాసులోని ప్రాచ్య పరిశోధన సంస్థలోని ఆంధ్ర శాఖలో చేరి క్రమేపీ ఆ శాఖకు అధ్యక్షులయ్యారు. విద్యారత్న, కళాప్రపూర్ణ బిరుదులు పొందారు. 1982 అక్టోబరు 15న కన్నుమూశారు.

ప్రొఫెసర్ బీఎం శ్రీకంఠయ్య (జయంతి)



బెళ్ళూరు మైలారయ్య శ్రీకంఠయ్య (బీఎంశ్రీ) 1884 జనవరి 3న తుమకూరు జిల్లా తురువేకెరె తాలూకా సంపిగె గ్రామంలో జన్మించారు. కన్నడ కవి, సాహితీవేత్త, నాటకకారుడిగా పేరొందారు. 70, 80 ఏళ్లక్రితం ఆంగ్ల భాష ప్రభావం అధికంగా ఉన్న తరుణంలో కన్నడ భాషకు సముచితస్థానం దక్కేలా ఎంతో కృషి చేశారు. అధ్యాపకులుగా, ప్రాధ్యాపకులుగా, వైస్‌చాన్స్‌లర్‌గా వ్యవహరించారు. కన్నడ సాహిత్య పరిషత్‌కు ఉపాధ్యక్షులుగా వ్యవహరించారు. కువెంపు ఆయనను 'నవ యుగ ప్రవర్తక'గా పిలిచారు. కాగా 'కన్నడద కణ్వ' గా పేరొందారు. తమిళంలోని వళ్ళువర్ రచనలను కూడా ఆయన తర్జుమా చేశారు. 1946 జనవరి 5న కన్నుమూశారు.

ఎంఎస్ గోపాలకృష్ణన్ (వర్ధంతి)



మైలాపూర్ సుందరం గోపాలకృష్ణన్ 1931 జూన్ 10న చెన్నై ప్రాంతం మైలాపూర్‌లో జన్మించారు. కర్ణాటక సంగీతంలో వయోలిన్ వాదనలో పేరొందారు. తండ్రి పారూర్ సుందరం అయ్యర్ నుంచి నుంచి హిందూస్థానీ సంగీతంలోనూ, కర్ణాటక సంగీతంలోనూ శిక్షణ పొందారు. లాల్గుడి జయరామన్, టీఎన్ కృష్ణన్, ఎంఎస్ గోపాలకృష్ణన్‌లు కర్ణాటక సంగీత వయోలిన్ త్రయంగా పేరొందారు. సంగీత కళానిధి, కళైమామణి, పద్మశ్రీ, పద్మభూషణ్, సంగీత కళానిధి, సంగీత నాటక అకాడమీ అవార్డులు పొందారు. దేశ విదేశాలలో పర్యటించి తన కళను ప్రదర్శించారు. 2013 జనవరి 3న కన్నుమూశారు.

మైఖేల్ షూమాకర్ (పుట్టినరోజు)



జర్మనీ దేశానికి చెందిన మైఖేల్ షూమాకర్ 1969 జనవరి 3న జన్మించారు. రేసింగ్ డ్రైవర్‌గా సత్తా చాటుకున్నారు. జోర్డాన్ జట్టు ద్వారా అడుగు పెట్టారు. ఫార్ములా వన్, ఫార్ములా వన్ డ్రైవర్, ఫార్ములా వన్ జట్ల నుంచి పోటీ చేశారు. 1994, 1995లలో రెండుసార్లు వరల్డ్ చాంపియన్‌షిప్ గెలుపొందారు. ఫాస్టెస్ట్ ల్యాప్, పుల్ పొజిషన్ తదితర రేసుల్లో సత్తా చాటుకున్నారు. వరల్డ్ డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్స్‌ను ఏడుసార్లు అందుకోగా 2012లో రిటైర్మెంట్ ప్రకటించారు. అత్యధికంగా 91సార్లు విజయాలు నమోదు చేసిన ఘనత ఆయనది. యునెస్కో అంబాసిడర్‌గా పలు చారిటీ కార్యక్రమాలకు భారీగా నగదు సేకరించి విరాళాలు సమకూర్చారు.

గత ఏడాది బెంగళూరు రోడ్డు ప్రమాదాల్లో

909 మంది మృతి

బెంగళూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర పరిధిలో గత ఏడాది (2023)లో జరిగిన రోడు ప్రమాదాల్లో 909 మంది మృతి చెందారు. ఈ వివరాలను నగర ట్రాఫిక్ పోలీస్ విభాగం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.. 12 నెలల అవధిలో జరిగిన ఈ ప్రమాదాల్లో 880 మంది తీవ్రంగా గాయపడగా, 4,201 మంది స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనకు సంబంధించి పోలీసులు గత ఏడాది నేరుగా 2,49,624 కేసులను నమోదు చేయగా, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా 87,25,321 కేసులను నమోదు చేశారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించినందుకు గాను రూ.184.83 కోట్లను జరిమానా రూపంలో వసూలు చేశారు. ప్రత్యేకించి మద్యం సేవించి వాహనాలను నడిపిన వారిపై 7055 కేసులు నమోదయ్యాయని ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థుల దాతృత్వం.. వృద్ధులకు సాయం

పావగడ/మడకశిర రూరల్, జనవరి 2: ప్రతి రోజు ఒక్కొక్క విద్యార్థి నుంచి పిడికెడు చొప్పున సేకరించిన బియ్యం పది క్వింటాళ్లకు చేరుకున్నాయి. ఆ బియ్యాన్ని మడకశిర మండలం ఆమిదాలగొందిలోని వెంకటేశ్వర వృద్ధాశ్రమానికి అందించి మానవత్వం చాటుకున్నారు పావగడ పట్టణంలోని చెళ్లకెరె రోడ్డులో ఉన్న గురుకుల పాఠశాల నిర్వాహకులు, విద్యార్థులు. పాఠశాల కార్యదర్శి ఎంసీ నాగభూషణ్ ఆధ్వర్యం లో మంగళవారం వృద్ధాశ్రమంలో అందజేశారు. నూతన సంవత్సరాన్ని ఈ విధంగా ఆచరించినట్లు ఆయన తెలిపారు. ప్రతి రోజు ఒక్కో విద్యార్థి పిడికెడు బియ్యం చొప్పున మూడు నెలల నుంచి సేకరించగా పది క్వింటాళ్లకు చేరుకున్నట్లు తెలిపారు. బియ్యం అందించిన పాఠశాల సిబ్బందికి, కార్యదర్శికి వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు తిమ్మారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మైలారరెడ్డి, హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు శశికిరణ్, పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత ఫుట్‌పల్స్ థెరపీ

పావగడ, జనవరి 2: స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఈ నెల 13వతేదీ వరకు తాలూకా ప్రజల కోసం ఫుట్‌పల్స్ థెరపీ ఉచిత చికిత్సా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తెలియజేశారు. ఆయన మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు నిర్వహించే ఈశిబిరంలో ఎలాంటి మందులు మాత్రలు లేకుండా 30 నిమిషాల పాటు చికిత్స నిర్వహిస్తారని తెలిపారు. గ్యాస్ట్రిక్, వెన్నునొప్పి, తలనొప్పి, నిద్రహీనత, కండరాల నొప్పి, థైరాయిడ్, బీపీ, పక్షవాతం, మధుమేహం తదితర జబ్బులను ఫుట్‌పల్స్ థెరపీ ద్వారా నయం చేస్తారని తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వెనక భాగంలో ఉన్న రోటరీ క్లబ్‌లో నిర్వహించే ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బెంగళూరు 'చిత్రసంతే'కు ఏర్పాట్లు పూర్తి

▸ 7న ప్రారంభించనున్న సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక చిత్రకళా పరిషత్ ఆధ్వర్యంలో 21వ చిత్రసంతెను ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఈనెల 7న ఉదయం 10.30 గంటలకు కుమారకృప ప్రాంగణంలో లాంచనంగా ప్రారంభించనున్నారు. కళాఖండాల ప్రదర్శనను ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రారంభిస్తారు. ఈ వివరాలను చిత్రకళా పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ బీఎల్ శంకర్ మంగళవారం మీడియాకు తెలిపారు. శనివారం ఉదయం ప్రారంభమయ్యే చిత్రసంతె రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగుతుందన్నారు. చిత్రసంతెలో పాలుపంచుకుంటున్న వివిధ రాష్ట్రాలకు చెందిన 1500మంది కళాకారులకు భోజన సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేకించి ఇతర రాష్ట్రాలనుంచి వస్తున్న 400మంది కళాకారులకు ఈసారి ఉచితంగా వసతి కల్పిస్తున్నామన్నారు. చిత్రసంతెను సుమారు 6 లక్షలమంది తిలకించవచ్చునని అంచనా వేస్తున్నామన్నారు. అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా సీసీటీవీ కెమెరాలు అమరుస్తున్నామన్నారు. లక్షలాదిమంది కళాప్రియులు రానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు కల్పిస్తున్నామని, పార్కింగ్‌కు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 20చోట్ల మొబైల్ టాయ్‌లెట్‌లను, చెత్త కుండీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. భారత సేవాదళ ఆవరణలో కూడా ఈసారి స్టాల్స్ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. తెలంగాణ నుంచి 27మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి 44మంది కళాకారులు ప్రదర్శనకు హాజరు కానున్నారని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కాగాఈనెల 6న ఉదయం చిత్రకళా సమ్మాన్ పురస్కారాలను హోం మంత్రి డాక్టర్ జీ పరమేశ్వర్ అందచేస్తారన్నారు. హెచ్‌కే కేజ్రీవాల్ పురస్కారాన్ని ప్రొఫెసర్ వసుధా తోజూరుకు ఇవ్వనున్నారు. ఎం ఆర్యమూర్తి పురస్కారం కోసం ప్రొఫెసర్ బీవీ సురేశ్‌ను ఎంపిక చేశారు. డీ దేవరాజ్ అరసు పురస్కారాన్ని ఎల్ఎన్ తల్లూరుకు ప్రదానం చేయనున్నారు. వై సుబ్రమణ్యరాజు పురస్కారాన్ని బీవీ రాఘవేంద్రకు అందజేయనున్నట్టు బీఎల్ శంకర్ మీడియాకు తెలిపారు. మీడియా సమావేశంలో చిత్రకళాపరిషత్ పదాధికారులు, ప్రిన్సిపాల్స్ హాజరయ్యారు.



చిత్రసంతె పోస్టర్లను విడుదల చేస్తున్న బీఎల్ శంకర్ తదితరులు

పథకాలతో స్వావలంబన సాధించండి



చెక్కులు అందజేస్తున్న పురసభ సభ్యుడు చంద్రారెడ్డి తదితరులు

బంగారపేట, జనవరి 2: ప్రజలందరూ స్వావలంబన దిశగా సాగాలనే ఉద్దేశ్యంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనేక పథకాలు ప్రవేశపెట్టారని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకుడు, పురసభ సభ్యుడు కే చంద్రారెడ్డి అభిప్రాయపడ్డారు. తాలూకాలోని కెసరనహళ్ళి గ్రామంలో యూనియన్ బ్యాంకు సహకారంతో వికసిత భారత సంకల్పయాత్ర కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. వీధి వ్యాపారులకు ఎటువంటి గ్యారెంటీతో నిమిత్తం లేకుండా రూ.10వేల వరకు బ్యాంకు రుణాలు సాధ్యమని, తిరిగి సకాలంలో చెల్లిస్తే రూ.20వేలవరకు రుణం పొందవచ్చునన్నారు. ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. విశ్వకర్మ పథకం కింద ప్రతి కార్మికుడికి కేవలం 5శాతం వడ్డీతో రూ.లక్ష వరకు రుణం సాధ్యమన్నారు. దీన్ని తిరిగి చెల్లించాక రూ.2 లక్షల వరకు పొందే అవకాశం ఉందన్నారు. ఇలా గరిష్ఠంగా రూ.10లక్షల వరకు వీలుందన్నారు. జిల్లా పంచాయతీ మాజీ సభ్యుడు బీవీ మహేశ్ మాట్లాడుతూ కోవిడ్‌వేళ ప్రతి ఒక్కరికి ఉచితంగా వ్యాక్సిన్ సమకూర్చిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. ప్రతి ఇంటికీ నీటిని అందించే పథకానికి కోలారు జిల్లాకు రూ.1840 కోట్లు గ్రాంటు కేటాయించారని ఈ పనులు వేగిరంగా కొనసాగుతున్నాయన్నారు. గ్రామ సడక్ యోజనె కింద గ్రామీణ ప్రాంత రహదారులు, పంచాయతీలలో చెత్త సంస్కరణ విభాగ వాహనాలకు కేంద్రం నిధులు ఇచ్చిందన్నారు. ఆయుష్మాన్‌భారత్ పథకం కింద రూ.5 లక్షల వరకు వైద్యసదుపాయం పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కెసరనహళ్ళి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు లలిత, పురసభ సభ్యుడు కపాలి శంకర్, గ్రామపంచాయతీ సభ్యుడు కేఎం మంజునాథ్, పీడీఓ దివ్య, రేణుకా, బ్యాంకు మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

దోబీఘాట్ స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్

బాగేపల్లి, జనవరి 2: పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయ సమీపాన సింగనాయకన దిన్నెలో సర్వే 20లో 22 గుంటల స్థలాన్ని రెవెన్యూ శాఖ అధికారులతో కలసి తహసీల్దార్ పరిశీలించి దోబీఘాట్ ప్రాంతాన్ని పరిశీలించారు. మంగళవారం సదరు స్థలం కొలతలు తీసుకున్నారు. 2020 లో జిల్లా అధికారి నుంచి స్థలం కేటాయించారు. అనంతరం సదరు స్థలానికి ప్రహరీ నిర్మించారు. అయితే ఇటీవల కొందరు ప్రైవేట్ వ్యక్తులు ప్రహరీని పడగొట్టి ఆక్రమించేందుకు ప్రయత్నించడంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ ప్రశాంత్ కే పాటిల్ సదరు స్థలాన్ని పరిశీలించారు. మంజూరైన స్థలానికి మళ్లీ ప్రహరీగోడ నిర్మించేందుకు అనుమతించారు. ఈ సందర్భంగా మడివాళ సామాజిక వర్గ ప్రముఖుడు సురేశ్, నాగరాజ్, క్రికెట్ మూర్తి, గుట్టపాళ్య మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రశాంత్ కె. పాటిల్ తదితరులు

కన్నడ పోరాట నేతలను విడుదల చేయాలి



తహసీల్దార్ బీఎన్ స్వామికి వినతి పత్రం అందజేత

శిడ్లఘట్ట, జనవరి 2: కన్నడేతర నామఫలకాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన కర్ణాటక రక్షణా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నారాయణగౌడ, ఇతర కన్నడ పోరాట నేతలను అరెస్టు చేయడాన్ని స్థానిక కన్నడ సంఘాలు నిరసన తెలిపాయి. పట్టణంలోని మినీ విధానసౌధ వద్ద తాలూకా కరవే, ఏకాభిప్రాయ పోరాట సమితి పదాధికారులు, ఇతర నాయకులు నిరసన తెలిపారు. కర్ణాటకలో కన్నడ భాషే సార్వభౌమత్వం ఉండాలన్నారు. కన్నడ భాష, నేల, సంస్కృతి అంశాలలో కన్నడ మనుగడకు సొంత గడ్డపైనే పోరాటం చేయాల్సి రావడం విచారకరమన్నారు. వినతిపత్రాన్ని స్వీకరించిన తహసీల్దార్ బీఎన్ స్వామి మాట్లాడుతూ సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాగా ఇతరభాషల నామఫలకాలు తొలగించే అంశంపై ప్రభుత్వ ఆదేశాలను పాటించనివారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా కస్తూరి కర్ణాటక జనశక్తి వేదిక తాలూకా అధ్యక్షుడు రామాంజినేయ, రైతు సంఘం భక్తరహళ్ళి ప్రతీశ్, కన్నడ పోరాట ప్రముఖులు సురేశ్, హెచ్ఎం నాగరాజ్, మునిరాజు కుట్టి, సువర్ణ కర్ణాటక జనశక్తి వేదిక, జిల్లా సంచాలకులు అంబారి మంజునాథ్, వరదరాజ్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కుట్టుమిషన్ల పంపిణీ

మహదేవపుర, జనవరి 2: నియోజకవర్గ పరిధిలోని బీబీఎంపీ కార్యాలయంలో బీబీఎంపీ నేతృత్వంలో సాంఘిక సంక్షేమశాఖ తరపున లబ్ధిదారులకు కుట్టుమిషన్లు, సైకిళ్లను మంగళవారం పంపిణీచేశారు. ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి ముఖ్యులుగా పాల్గొని లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ తరపున అందే సౌలభ్యాలను అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీబీఎంపీ జాయింట్ కమిషనర్ డాక్టర్ దాక్షాయిని, ముఖ్యులు అనంతరామయ్య, హరాడి పిల్లప్ప, లోకేశ్, పురాణిక్ తదితరులు పాల్గొన్నారు.



కుట్టుమిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి

అమరవీరులకు గౌరవ వందనం

బంగారపేట, జనవరి 2: అస్పృశ్యుల హక్కులకోసం పేశ్వాలపై సాగిన సమరంలో అమరులైన వారికి గౌరవం సమర్పించామని ఇది దళిత సముదాయాలు గర్వపడే అంశమని దళిత సంఘర్ష సమితి సంచాలకుడు సూలికుంటె రమేశ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉద్యానవనంలో దళిత సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో కోరెగావ్ విజయోత్సవాన్ని పురస్కరించుకుని సాయంత్రం పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హక్కుల కోసం స్వాభిమానంతో చేసిన మహాయుద్ధమే భీమా కోరెగావ్ సమరంగా అభివర్ణించారు. 1818 జనవరి 1న జరిగిన యుద్ధంలో మహర్ సైనికులు సాధించిన విజయం గురించి చరిత్ర ద్వారా తెలుసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో కర్ణాటక దళిత రైతుసేన అధ్యక్షుడు వెంకటేశ్, సీనియర్ ప్రముఖులు ఐపల్లి నారాయణ స్వామి, జీవిక డాక్టర్ రామచంద్రప్ప, మారుతి ప్రసాద్, కళాకారుడు మునికృష్ణ దళితసంఘాల ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న ప్రముఖులు

ఉపాధ్యాయుడికి ఆత్మీయ వీడ్కోలు

శిడ్లఘట్ట, జనవరి 2: ఉపాధ్యాయుడిగా 37 సంవత్సరాల సుదీర్ఘ సేవలందించి రిటైరైన నారాయణస్వామిని ఆత్మీయంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పట్టణం లోని ప్రభుత్వ ఎయిడెడ్ సరస్వతి కాన్వెంట్‌లో 1986 నుంచి 2023 వరకు ఉపాధ్యాయుడిగా పనిచేసిన నారాయణస్వామికి ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారం, కర్ణాటక అకాడమీ ఆఫ్ మ్యాథమ్యాటిక్స్, కావ్యదీప్తి పురస్కారం, స్కౌట్స్ అండ్ గైడ్స్ సీనియర్ అవార్డు, జిల్లా రాజ్యోత్సవ అవార్డు, జిల్లాస్థాయి శరణబందు పురస్కారం, రాష్ట్రస్థాయి కన్నడ సేవారత్న పురస్కారం, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారం అందుకున్నారు. కేవలం పాఠాలకే పరిమితం కాకుండా ప్రతిభా కారంజి, ప్రవాస, జాతీయ పండుగల వేళ విద్యార్థులు భాగస్వామ్యం అయ్యేలా ప్రోత్సహించడం, క్రమశిక్షణ, పోటీ మనోభావంతో ముందుకు సాగేలా చిన్నారులను ప్రోత్సహించారు. అంతేకాక కన్నడ కార్యక్రమాలు, పోరాటాల్లోనూ చురుగ్గా పాల్గొనేవారు. రిటైరైన టీచర్స్ సంఘం ఆధ్వర్యంలో నారాయణస్వామి, డీఎస్ నాగరత్నమ్మ దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా బీఈఓ నరేంద్రకుమార్, పాఠశాల పాలకవర్గం అధ్యక్షుడు శ్రీకాంత్, రైతుసంఘం, ప్రాథమిక ఉన్నత, ఇంగ్లిష్‌మీడియం ఉపాధ్యాయులు, రైతుసంఘం ప్రధాన కార్యదర్శి భక్తరహళ్ళి బైరేగౌడ తదితరులు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



రైతుసంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దంపతులకు సన్మానం

ఘనంగా పాఠశాల క్రీడా దినోత్సవం

బొమ్మనహళ్ళి, జనవరి 2: జేపీనగర్ రింగ్‌రోడ్డు విజయనగర్ కాలనీలోని ఫ్లోరిడా పాఠశాలలో 24వ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కబడ్డీ, ఖోఖో, జంపింగ్, తదితర పలు రకాల క్రీడా పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రం అందజేశారు. ఇదే సందర్భంగా క్రమశిక్షణ పాటించిన వారికి ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల యాజమాన్య నిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.



వేదికపై ప్రముఖులు

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

బంగారపేట, జనవరి 2: తాలూకాలోని వట్రకుంటె గ్రామంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకున్న ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. బైక్‌పై వెళ్తున్న చలపతి (45) వాహనం అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న స్తంభానికి ఢీకొంది. ప్రమాదంలో నంగలి ప్రాంతానికి చెందిన చలపతి మృతి చెందగా బైక్ వెనుక కూర్చున్న పినతండ్రి వెంకటరామప్ప తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లక్ష్మీసాగర వద్ద ఉన్న బంధువుల ఇంటికి వచ్చి వాపసు వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనపై బంగారపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అకస్మాత్తు ప్రమాదంలో చోటు చేసుకున్న ఘటనలో మృతి కారణంగా గ్రామంలో విషాదం నెలకొంది.

రాష్ట్రంలో పెండింగ్‌లో

2,511 న్యాయ ఉల్లంఘన కేసులు

▸ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శికి జాబితా అందజేసిన అడ్వకేట్ జనరల్

బెంగళూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వశాఖలకు సంబంధించి 2,511 న్యాయ ఉల్లంఘన కేసులు పెండింగ్‌లో ఉన్నాయని హైకోర్టు అడ్వకేట్ జనరల్ కే శశికిరణ్‌శెట్టి ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి రజనీశ్ గోయెల్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈకేసుల పూర్తి వివరాల జాబితాను కూడా లేఖతో పొందుపరిచారు. హైకోర్టులోనూ, కర్ణాటక అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)లోనూ ఈ కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. హైకోర్టులో 1998 నుంచి 2023 వరకు 825 కేసులు ప్రధాన కోర్టులో పెండింగ్‌లో ఉండగా, ధారవాడ బెంచ్‌లో 107 కేసులు, కలబురగి బెంచ్‌లో 85 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక క్యాట్‌కు సంబంధించి బెంగళూరు బెంచ్‌లో 1387 కేసులు, బెళగావి బెంచ్‌లో 47 కేసులు, కలబురగి బెంచ్‌లో 40 కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు లేఖలో ప్రస్తావించారు. ప్రత్యేకించి ముఖ్యకార్యదర్శిని ప్రతివాదిగా చేసిన 49 కోర్టు ఉల్లంఘన కేసులలో ఇంత వరకు కౌంటర్ అఫిడవిట్ దాఖలు కాలేదన్నారు. పెండింగ్ కేసులను సాధ్యమైనంత త్వరగా క్లియర్ చేసే పనిచేపట్టాలని కూడా ప్రభుత్వ ముఖ్యకార్యదర్శికి అడ్వకేట్ జనరల్ శశికిరణ్ సూచించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి రజనీశ్ గోయెల్ మంగళవారం వివిధశాఖల ప్రధాన కార్యదర్శులకు సూచనలు చేస్తూ పెండింగ్‌లో ఉన్న న్యాయ ఉల్లంఘన కేసులు సాధ్యమైన త్వరగా క్లియర్ చేయాలని లేఖలు రాశారు.

అయోధ్య తర్వాత.. కాశీ, మధుర వంతు...

▸ బీజేపీ నేత ఈశ్వరప్ప

బెంగళూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో వివాదాస్పద కట్టడాన్ని కూల్చి వేసి రామమందిరాన్ని నిర్మించినట్టే మధురలోనూ శ్రీకృష్ణ దేవస్థానం చట్ట ప్రకారమే నిర్మిస్తామని బీజేపీ నేత కేఎస్ ఈశ్వరప్ప పేర్కొన్నారు. బెంగళూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అయోధ్యలో రామమందిర నిర్మాణం సాకారం కావడంతో ఇప్పుడు హిందువులందరి దృష్టి కాశీ, మధురలపై కేంద్రీకృతమైందన్నారు. కోర్టు తీర్పులకు అనుగుణంగా చట్టబద్ధంగా సర్వే పనులు జరుగుతున్నాయన్నారు. అయోధ్యలో 496 సంవత్సరాల క్రితం రామమందిరాన్ని మొఘల్ రాజు బాబర్ ధ్వంసం చేసి మసీదు నిర్మించాడని, మళ్లీ ఇన్నాళ్లకు తాము జీవించి ఉండగానే అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణాన్ని చూడగలిగే అదృష్టం లభిస్తున్నందుకు సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. ఈ మూడు మందిరాల విషయాన్ని మత కోణంలో చూడరాదని స్పష్టం చేసిన ఆయన, గతంలో జరిగిన పొరపాట్లను ప్రధాని నరేంద్రమోదీ దిద్దుతూ హిందూ సనాతన వైభవాన్ని పునరుద్ధరిస్తున్నారన్నారు. జనవరి 22న అయోధ్య రామందిరం ప్రారంభాన్ని పండుగలా చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రఖ్యాత వయోలిన్ విద్వాంసురాలికి

ప్రతిష్ఠాత్మక పురస్కారం

బెంగళూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరానికి చెందిన ప్రముఖ వయోలిన్ విద్వాంసురాలు జ్యోత్స్న శ్రీకాంత్‌కు ప్రతిష్ఠాత్మక 'మెంబర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటీష్ ఎంపైర్' పురస్కారం లభించింది. ఈ పురస్కారం బ్రిటన్‌లో మూడో అత్యుత్తమ పురస్కారం కావడం విశేషం. యునైటెడ్ కింగ్డమ్‌లోని విండ్సర్ క్యాస్టెల్‌లో జరిగిన కార్యక్రమంలో బ్రిటన్ యువరాజు కింగ్ చార్లెస్ 3, జ్యోత్స్నకు ఈ పురస్కారాన్ని అందచేసి సన్మానించారు. అంతర్జాతీయ స్థాయిలో సంగీతరంగానికి ఆమె చేస్తున్న సేవలకు గుర్తింపుగానే ఈ పురస్కారాన్ని అంద జేశారు. బ్రిటన్‌లోని మూడో ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, ఇది కర్ణాటక సంగీత రంగానికి అపురూప గౌరవమని జ్యోత్స్న బెంగళూరులో మంగళవారం మీడియాకు చెప్పారు. దక్షిణభారత్‌లోని 300కుపైగా సినిమాలలో తాను వైయొలిన్ సంగీతాన్ని అందించానని, కర్ణాటక సంగీత దిగ్గజం డాక్టర్ బాలమురళీకృష్ణతో కలసి జుగల్బందీ చేశానన్నారు. ఐరోపా దేశాల సంగీత ప్రియులు సైతం కర్ణాటక సంగీతాన్ని అమితంగా ఇష్టపడుతున్నారన్నారు.



బ్రిటన్ యువరాజు నుంచి పురస్కారం అందుకుంటున్న జ్యోత్స్నా శ్రీకాంత్

మొబైల్ కోసం మెట్రో పట్టాలపై దూకిన యువతి

▸ రెప్పపాటు సమయంలో రక్షించిన సిబ్బంది

బెంగళూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇందిరానగర్ మెట్రో రైల్వేస్టేషన్‌లో అందరూ రైలురాకకోసం ఎదురుచూస్తున్నారు. ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంపై నిలబడిన మహిళ చేతిలోని మొబైల్ పొరపాటున జారి రైలు పట్టాలపై పడింది. దీన్ని అందుకునేందుకు ఆమె పట్టాలపైకి దూకడం, రెప్పపాటు సమయంలోనే విద్యుత్ సరఫరాను సిబ్బంది సమయస్ఫూర్తితో నిలిపివేయడంతో ఆమె ప్రాణాలతో బయట పడింది. పర్పుల్‌లైన్‌లో రద్దీ సమయంలో జరిగిన ఘటనతో దాదాపు 15 నిమిషాలపాటు మెట్రో రైళ్ల సంచారానికి అంతరాయం ఏర్పడింది. బయ్యప్పనహళ్ళి వైపు వెళ్తున్న మెట్రో రైలు ఇందిరానగర్ స్టేషన్‌కు రావడానికి కొద్ది నిమిషాల ముందు సోమవారం సాయంత్రం సుమారు 6.45 గంటలకు ఘటన చోటు చేసుకుంది. మెట్రో రైలు పట్టాలపై ఏకంగా 750 ఓల్ట్ విద్యుత్ ప్రవహిస్తుంటుంది. సిబ్బంది సమయస్ఫూర్తితో యువతి దూకడాన్ని గమనించి విద్యుత్ సరఫరాను ఆపేయడంతో ఆమె ప్రాణాలతో బయటపడిందని మెట్రో అధికారి శ్రీనివాస్ రాజగోపాలన్ మీడియాకు తెలిపారు. రైలు పట్టాలపై ప్రమాదవశాత్తు వస్తువులు పడకుండా ఉండేలా చూసేందుకు ప్రయాణీకులను దూరంగా నిలబెడుతున్నామని అయినా కూడా అడపాదడపా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. యువతిని తొలి తప్పుగా పరిగణించి మందలించి వదిలేశామన్నారు.

ఎంఎస్ఎంఈలతోనే ఉపాధి పెంపు

బెంగళూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): చిన్న, మధ్య తరహా పరిశ్రమలు పెరిగితేనే ఉపాధి అవకాశాలు మెరుగు అవుతాయని ఇండియా మార్ట్ ఫౌండర్ బ్రిజేశ్ అగర్వాల్ అభిప్రాయపడ్డారు. నగరంలో ఎంఎస్ఎంఈల ప్రాఫికార్న్ 2023 సదస్సు జరిగింది. డాక్టర్ ఏ వేలుమణి, రాజా షమానితోపాటు పలువురు పారిశ్రామికవేత్తలు భాగస్వాములయ్యారు. రెండు రోజుల సదస్సులో 1200మందికిపైగా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. తొలిరోజున రాజాషమాని ప్రసంగిస్తూ సమాజంలో ప్రతి ప్రాంతంలోనూ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం ఉందన్నారు. 1990లో న్యూట్రిషన్ బ్రాండ్ ప్రారంభించిన విధానం ప్రగతిని వివరించారు. రామేశ్వరం కెఫె వ్యవస్థాపకులు దివ్య రాఘవేంద్రరావు సాధనలను వివరించారు. ఇదే సందర్భంగా 43మందికి బిజినెస్ సక్సెస్ అవార్డులను ప్రదానం చేశారు. రెండోరోజున డాక్టర్ ఏ వేలుమణి కొత్త పరిశ్రమల ప్రారంభానికి సంబంధించి ప్రభుత్వ సౌలభ్యాలను వివరించారు. రెండు రోజుల సదస్సులో యువ పారిశ్రామికవేత్తలకు మరిన్ని మార్గదర్శకాలు చేసినట్టు అయ్యిందని పలువురు అభిప్రాయపడ్డారు.

బ్రహ్మచైతన్య మందిరంలో ఆరాధనోత్సవం

చింతామణి, జనవరి 2: పట్టణంలోని ఎస్ఆర్ లే అవుట్‌లోగల శ్రీరామ మందిరంలో సద్గురు బ్రహ్మచైతన్య మహరాజ్ 110వ ఆరాధనోత్సవాన్ని పురస్కరించుకుని నాల్గవ రోజు మంగళవారం జపాలు, భజనలు ఇతర ధార్మిక కార్యక్రమాలు సాగాయి. పలు భజనామండళుల ఆధ్వర్యంలో ప్రార్థనా గీతాలు ఆలపించారు. అక్షరానందేంద్ర సరస్వతి స్వామిజీచే ప్రవచనం, కౌస్తుభ భజనామండలి, వైష్ణవి భజనా మండలి నుంచి గాయన సేవ భారతరత్న గ్రహీత ఎంఎస్ సుబ్బలక్ష్మి ముని మనుమరాలు ఐశ్వర్య, సౌందర్యలు పాల్గొని పాటలు ఆలపించారు. బుధవారం కూడా పలు కార్యక్రమాలు కొనసాగనున్నాయి.